క్లుప్తంగా

నేటినుంచి చక్రధర పెరుమాళ్ బ్రహ్మోత్సవాలు


చక్రధర పెరుమాళ్లస్వామి

కవిటి: బెజ్జిపుట్టుగలోని చక్రధర పెరుమాళ్ స్వామి ఆలయ తృతీయ బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకోసం ఆలయ అనువంశిక ధర్మకర్తలు ఏర్పాట్లు చేశారు. రోజూ ప్రత్యేక పూజలు జరగనున్నాయి.

భక్తిశ్రద్ధలతో కుంకుమపూజలు


కుంకుమపూజల్లో మహిళలు

సోంపేట: తాళ్లభద్ర గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం నిర్వహించిన కుంకుమ పూజల్లో అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అక్కాజ్యోషుల రమేశ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్ పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పాఠశాలకు ఇన్వర్టర్ వితరణ


ఇన్వర్టర్‌ను అందజేస్తున్న దృశ్యం

మందస: స్థానిక ఉన్నత పాఠశాలకు రూ.22 వేల విలువైన ఇన్వర్టర్, బ్యాటరీని కొత్తపల్లి గ్రామానికి చెంది.. శ్రీకాకుళంలో వాణిజ్య పన్నుల విభాగంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న బడియా కామరాజు శనివారం వితరణ చేశారు. టెన్త్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో కరెంటుపోయే సమయంలో ఇబ్బంది లేకుండా ఇన్వర్టర్‌ను సమకూర్చినట్టు దాత చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ బి.శ్రీదేవి, రిటైర్డ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ తెప్ప పాండురగారావు, స్థానిక హెచ్‌ఎం డిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాయకుల పరామర్శ

టెక్కలి: సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లో ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకులకు చెందిన కుటుంబ సభ్యులు పలువురు మృతి చెందారు. దీంతో వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆయా కుటుంబాలను శనివారం పరామర్శించారు. సంతబొమ్మాళి మండలం నర్సాపురంలో ఎం.భాస్కర్‌రెడ్డి తండ్రి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని, కోటబొమ్మాళి మండలం కురుడులో మెండ శ్రీను తండ్రి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని తిలక్ పరామర్శించి ఓదార్చారు. కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు డి.వెంకట్రావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రామారావు, మండల అధ్యక్షుడు ఎస్.హేమసుందర్‌రాజు, నాయకులు పి.వెంకట్రావు, పి.మోహన్, డి.లోకేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

కంచిలి: మండల మాజీ విద్యాశాఖాధికారి, రిటైర్డు హెచ్‌ఎం జన్నెల బాలక్రిష్ణ అనారోగ్యంతో మృతిచెందారు. మృతుని కుటుంబాన్ని సోంపేటలోని తన నివాసానికి వెళ్లి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి పరామర్శించారు. అలాగే ముండ్ల పంచాయతీ పరిధి కేశపురం గ్రామానికి చెందిన కామా ప్రధాన్ చనిపోవడంతో ఆ కుటుంబాన్ని కూడా పరామర్శించారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, నాయకులు దుర్గాసి ధర్మారావు, లడ్డు కేశవపాత్రో, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, ముండ్ల సర్పంచ్ రామచంద్ర ప్రధాన్ ఉన్నారు.

నీటి వెతలు!


అరకొరగా వస్తున్న నీటిని పట్టుకుంటున్న మహిళలు

అక్రమ మోటార్లను తొలగించాలి



పైపులైన్లకు కొంతమంది అక్రమంగా మోటార్లను బిగించి నీటిని చోరీ చేస్తున్నారు. దీంతో శివారు ప్రాంతాలకు నీరు సరఫరా కావడం లేదు. ఈ సమస్య చాలా ఏళ్లుగా ఉంది. మున్సిపల్ అధికారులు దృష్టిసారించి అక్రమ మోటార్లను తొలగించాలి.
– ఉప్పాడ దామోదర, ఉప్పాడ వీధి, ఇచ్ఛాపురం

రోజూ నీటిని సరఫరా చేయాలి



పట్టణ ప్రజలకు రోజూ నీటిని సరఫరా చేయాలి. రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తుండడంతో సమస్య తలెత్తుతోంది. మున్సిపల్ అధికారులు ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. – దక్కత మోహన్, ఉప్పాడ వీధి

ఇచ్ఛాపురం టౌన్: వేసవి పూర్తిస్థాయిలో ప్రభావం చూపకముందే ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. గుక్కెడు నీటి కోసం పడరానిపాట్లు పడుతున్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో పలు వీధుల్లో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఉప్పాడ వీధి, బెల్లుపడ తదితర ప్రాంతాలకు రెండు రోజులకు ఒకసారి మున్సిపల్ నీటి విభాగం సిబ్బంది నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో తగినంత నీరులభ్యం కాక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అలాగే పట్టణానికి నీటిని సరఫరా చేసే పైప్‌లైన్లకు కొంతమంది అక్రమంగా మోటార్లను బిగించి తమ ఇళ్లకు నీటిని మళ్లించుకుంటున్నారు. దీంతో శివారు ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం తలెత్తుతోంది. దీన్ని అరికట్టాల్సిన అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సక్రమంగా నీటిని సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం



టెక్కలి సత్యసాయి నిత్యన్నపూర్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. సేవా సమితి సభ్యులు టి.నాగరాజు, శేఖర్, విమలకుమారి సౌజన్యంతో చలివేంద్రం నిర్వహిస్తున్నట్లు సభ్యులు వెల్లడించారు. కార్యక్రమంలో జోగారావు, ఎం.నారాయణమూర్తి, వేణుగోపాలరావు, ఢిల్లీరావు, చంటి, బి.అన్నపూర్ణమ్మ, ఎస్.జగదీశ్వరరావు, లత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. – టెక్కలి

ముగిసిన ఉత్సవాలు



ఇచ్ఛాపురం మండలం బొడ్డబడలో జరుగుతున్న అన్నపూర్ణమ్మ గ్రామ దేవత ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి సల్ల దేవరాజు, సర్పంచ్‌లు నీలాపు సారధిరెడ్డి, సల్ల కృష్ణారెడ్డి, లోపింటి దీనబంధురెడ్డి పాల్గొన్నారు. – ఇచ్ఛాపురం రూరల్

గ్లాజులు పంపిణీ



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం టెక్కలి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మేజర్ పంచాయతీ పరిధి మహిళా పారిశుద్ధ్య కార్మికులకు గ్లాజులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. పంచాయతీ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిరంతరం శ్రమిస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికుల కోసం ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, సభ్యులు వి.రాజేష్, శ్రీనివాస్, సీతాపతి తెలిపారు. – టెక్కలి

లోక్ అదాలత్‌లో 184 కేసులు పరిష్కారం


టెక్కలి: లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు



ఇచ్ఛాపురం: కేసులను పరిష్కరిస్తున్న జడ్జి పరేష్‌కుమార్


సోంపేట: లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు

టెక్కలి: టెక్కలి కోర్టు సముదాయంలో సీనియర్ సివిల్ జడ్జి (ఎఫ్ఏసీ)జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి (ఎఫ్ఏసీ) డి.భరణి ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా 184 కేసులను పరిష్కరించారు. వీటిలో సివిల్ కేసులు 4, చెక్ బౌన్స్ 1, క్రిమినల్ 47, ఎక్సైజ్ 28, ప్లీ బార్గయినింగ్ ద్వారా రాజీ అయిన కేసులు 101, మనోవర్తి మూడు కేసులను పరిష్కరించారు. ఆయా కేసుల ద్వారా సుమారు 48,42,526 రూపాయల మేరకు సెటిల్‌మెంట్ అయింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.వివేకానంద, సభ్యులు ఎస్.ధర్మరాజు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో 130 కేసులు..

ఇచ్ఛాపురం: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 130 కేసులు పరిష్కారమయ్యాయి. జరిమాన రూపేణా రూ.41,300, సివిల్ సెటిల్‌మెంట్ కేసుల ద్వారా రూ.1,05,000 వసూలైనట్లు సిబ్బంది తెలిపారు. న్యాయవాదులు ఎస్.ఎల్.ఎస్.సీతయ్యరెడ్డి, రమణయ్య, ఎస్‌సీ సాహు, దేవరాజు, భారతిదివ్య పాల్గొన్నారు.

సోంపేటలో 47..

సోంపేట: సోంపేట కోర్టుల సముదాయంలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 47 కేసులు పరిష్కారమయ్యాయని సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు తెలిపారు. కోర్టుల సముదాయంలో రెండు బెంచ్‌లు ఏర్పాటు చేసి సోంపేట సీనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ న్యాయమూర్తి పి.పరేష్‌కుమార్ అదాలత్ నిర్వహించారు. న్యాయవాదులు కె.రాజు, డి.రుక్మాంగధరరావు పాల్గొన్నారు

దశల వారీగా పెన్షనర్ల సమస్యల పరిష్కారం


మహిళా సిబ్బందిని సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

టెక్కలి: టెక్కలి పెన్షనర్ల సంఘం పరిధిలో ఉన్న సభ్యులకు సంబంధించి దశల వారీగా పెన్షన్ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు అధ్యక్షుడు ఆర్.రామచంద్రరావు వెల్లడించారు. శనివారం సంఘం భవనంలో సమావేశాన్ని నిర్వహించారు. ఐడీ కార్డులు, లైఫ్ సర్టిఫికెట్లు, ఇన్‌కమ్‌ట్యాక్స్ రిటర్న్ సమస్యలపై చర్చించారు. అనంతరం సంఘం భవనంలో సేవలు అందజేస్తున్న మహిళా సిబ్బంది పుష్ప, భారతి తదితరులతో పాటు ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు ఆదినారాయణ, సూర్యనారాయణ, ఆనందరావును సన్మానించారు. సంఘ సభ్యులు జి.వి.రెడ్డి , ఎం.లక్ష్మీనారాయణ, కె.ధనుంజయరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సోంపేట: జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోంపేటలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. సుమారు వందమందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. సోంపేట ఎంపీటీసీ సభ్యుడు పాడుగు కామేష్, జెమ్స్ ఆస్పత్రి ఏరియా మేనేజర్ బి.లోకేస్ పాల్గొన్నారు.

ఉద్దాన కిడ్నీ విషాదాలు పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో ఎన్.వి.రమణ తదితరులు

కాశీబుగ్గ: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్‌లో ద్వితీయ తెలుగు మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. లండ రుద్రమూర్తి నిర్వహణ సారథ్యంలో బి.తులసీరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 'ఉద్దానం కిడ్నీ విషాదాలు'పుస్తకాన్ని సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ, మండల బుద్ధ ప్రసాద్, గజల్ శ్రీనివాస్, ప్రముఖ సినీ నటులు సాయికుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ప్రముఖ జానపద కళాకారుడు బద్రి కూర్మారావు సేకరించి ప్రచురించారు. ఉద్దాన కిడ్నీ బాధితుల సమస్యను శాశ్వత పరిష్కారం కోసం వేలాది మంది బాధితులు ఎదురు చూస్తున్నారని.. ప్రముఖల ముందు ఉద్దాన ప్రాంతీయులు డాక్టర్ కుమార్ నాయక్, శిష్టు మనోజ్ కుమార్, సొర్ర రామారావు, పొట్టి శివకుమార్, వంకల రాజారావు, తెప్పల కృష్ణమూర్తి నివేదించారు.

మంత్రికి వ్యవసాయంపై అవగాహన లేదు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సత్తారు సత్యం


మాట్లాడుతున్న సత్తారు సత్యం

టెక్కలి: వ్యవసాయ రంగంపై ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు అవగాహన లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సత్తారు సత్యం ఎద్దేవా చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ..ధాన్యం కొనుగోలు విషయంలో శతశాతం కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. రైతులు పండించిన సాధారణ రకం ధాన్యాన్ని ఎవరూ ఇష్టపడడం లేదని మంత్రి వ్యాఖ్యానించడం బాధాకరమన్నారు. సాధారణ, సన్నరకం ధాన్యాన్ని కూడా ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయలేదన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో మంత్రికి చిత్తశుద్ధి లేదని అర్థమైందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల వారికి నిరంతరం సంక్షేమ పథకాలు ఇచ్చిన ఘనత అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎటువంటి సంక్షేమ పథకాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

వినూత్నమైన ఆలోచనలతో అపారమైన అవకాశాలు

- టెక్ మహీంద్రా వైస్ ప్రెసిడెంట్ నాగార్జున


విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న టెక్ మహీంద్రా వైస్ ప్రెసిడెంట్ నాగార్జున తదితరులు


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

టెక్కలి: ఇంజినీరింగ్ విద్యార్థులు వినూత్నమైన ఆలోచనలు, ఆవిష్కరణలతో అపారమైన అవకాశాలు పొందవచ్చునని టెక్ మహీంద్రా వైస్ ప్రెసిడెంట్ మల్లాడి నాగార్జున అన్నారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం రాత్రి నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, సైబర్ టెక్నాలజీతో పాటు మెకానికల్ వంటి కోర్ ఇంజినీరింగ్‌కు అధికంగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన ఎంటెక్, బీటెక్, ఎంబీఏ కోర్సుల్లో అత్యధిక మార్కులు సాధించిన 74 మంది విద్యార్థులకు బంగారం, వెండి పతకాలతో పాటు స్కాలర్‌షిప్‌ను అందజేశారు. అలాగే భాగ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు సుమారు రూ. 50 లక్షల వరకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కళాశాల చైర్మన్ డాక్టర్ కె.సోమేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, కోశాధికారి టి.నాగరాజు, యాజమాన్య ప్రతినిధులు సుధాప్రియ, కె.రవికుమార్, టి.నాగేషు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మదినిండుగా.. అతివల పండుగ..

అన్నిరంగాల్లో దూసుకుపోతున్న మహిళలను మరింత ప్రోత్సహించాలని వక్తలు పిలుపునిచ్చారు. వారికి అండగా ఉంటే మరిన్ని అద్భుతాలు సృష్టిస్తారన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోసం అమలవుతున్న చట్టాలను వివరించారు. విధినిర్వహణలో మెరుగైన సేవలందిస్తున్న ఉద్యోగులను సత్కరించి గౌరవించారు. వారి సేవలను కొనియాడారు. పోలీసుల ఆధ్వర్యంలో చైతన్య ర్యాలీలు చేశారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ప్రజాసంఘాల ప్రతినిధులు నినదించారు.

– సాక్షి నెట్‌వర్క్


కవిటి: కవిటి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయినులను సత్కరిస్తున్న దృశ్యం


కవిటి: కవిటి ఎంఎంఎస్ భవనంలో మహిళలకు సత్కారం


ఇచ్ఛాపురం రూరల్: వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల నాయకులను సత్కరిస్తున్న సెర్ప్ సిబ్బంది


ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం కంద్రావార్డు మహిళలకు అవగాహన కల్పిస్తున్న నేషనల్ యూత్ వలంటీర్ హంగీర్ బెహరా


కాశీబుగ్గ: డీఎస్పీ వెంకట అప్పారావును సత్కరిస్తున్న ఆర్టీసీ మహిళా ఉద్యోగినులు


టెక్కలిలో ఎస్సైలు కె.రాము, రఘునాథరావు ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు


సోంపేట: బారువలో మహిళా దినోత్సవం సందడి..


కంచిలి: మండపల్లి వృద్ధాశ్రమంలో మహిళలను సత్కరిస్తున్న ఐకేపీ ఏపీఎం కొత్తకోట రమణమ్మ తదితరులు


వజ్రపుకొత్తూరు: మహిళలను సత్కరిస్తున్న వెలుగు ఏపీఎం ప్రసాదరావు


పలాస: వెలుగు కార్యాలయంలో మాట్లాడుతున్న సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు మల్లేశ్వరరావు


కంచిలి: మండల మహిళా సమాఖ్య ప్రతినిధులను సన్మానిస్తున్న ఏపీఎం ఎస్.ప్రసాదరావు


ఇచ్ఛాపురం టౌన్: కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నిలిమా



ఇచ్ఛాపురం టౌన్: మున్సిపల్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు


కాశీబుగ్గ: మెప్మా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు


కాశీబుగ్గ: గాంధీ విగ్రహం వద్ద లైంగిక వేధింపులు ఆపాలని మహిళా సంఘాల నిరసన


కాశీబుగ్గ పోస్టాఫీస్ వద్ద కేక్ కట్ చేస్తున్న మహిళా ఉద్యోగులు


టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో కేక్ కట్ చేస్తున్న చైర్మన్ డాక్టర్ సోమేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ సుధాప్రియ


కాశీబుగ్గ: పూజలందుకున్న ఎల్లమ్మతల్లి

జనజాతర

- భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మతల్లికి పూజలు


కాశీబుగ్గ: భక్తుల సేవలో స్వచ్ఛందసంస్థల సభ్యులు


కాశీబుగ్గ: భక్తులకు సేవలందిస్తున్న స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు


సంతబొమ్మాళి: మర్రిపాడు ఎల్లమ్మజాతరలో భక్తజన సందోహం

కాశీబుగ్గ: పలాస పట్టణం శనివారం జనసంద్రంగా మారింది. జామి ఎల్లమ్మ జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎల్లమ్మ దర్శనానికి సుమారు లక్షమంది భక్తులు తరలిరావడంతో పట్టణం కిటకిటలాడింది. వేకువజామున నాలుగు గంటలకు ప్రారంభమైన జాతర మహోత్సవం రాత్రి 11 గంటల వరకు కొనసాగింది. కాశీబుగ్గ బస్టాండ్ వరకు మాత్రమే బస్సులు, భారీ వాహనాల రాకపోకలకు అవకాశం ఉండడంతో పలాస వరకు భక్తులు కాలినడగ సాగించారు. కాశీబుగ్గ కేటి రోడ్డు మొదలు కొని పలాస కేటి రోడ్డు వరకు ఇరువైపులా వాపారులు, కొనుగోలుదారులతో నిండిపోయింది. విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు, సత్యసాయి, లయన్స్‌క్లబ్, ఆర్ఎస్ఎస్, కన్యకాపరమేశ్వరి, సత్యసాయి భక్తులు, విశ్వకర్మ, స్వచ్ఛందసంస్థలు భక్తులకు పులిహోరా, బిరియాని, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, సీఐ సూర్యనారాయణ పర్యవేక్షణలో ఇచ్ఛాపురం, టెక్కలి, పలాస, పాతపట్నం స్టేషన్లకు చెందిన సీఐలు, ఎస్సైలు, 150 మందికిపైగా పోలీసులు, ఏఆర్ ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహించారు. 30 మంది ఎన్‌సీసీ వలంటీర్లు సహకరించారు. మొగిలిపాడు నుంచి వచ్చే వాహనాలను కోసంగిపురం కూడలి మీదుగా మళ్లించారు. ప్రత్యేకమైన బారికేడ్లు ఏర్పాటు చేయడంతో ఎల్లమ్మ దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఆటంకం కలగలేదు.

మర్రిపాడులో..

సంతబొమ్మాళి: మర్రిపాడు ఎల్లమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఎల్లమ్మతల్లిని దర్శించుకొని మొక్కులను చెల్లించుకున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థలు భక్తులకు మజ్జిగ, మంచినీటిని అందించారు.